

# ప్రతినిధి

రాధిక

చిక్కని చీకట్లో సారంగం తవ్వుకుంటూ తారురోడ్డుమీద పరుగెడుతోంది బస్సు. తవ్విన సారంగం బస్సు వెనుక వెంటనే మూసుకుపోతోంది. అంత వరకూ చీకట్లో బ్రతుకుతున్న రెక్కల పురుగులు బస్సుముందు అద్దానికి విసురుగా తగులుతున్నాయి. చల్లటిగాలి ముఖానికి తగిలి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. నిద్రవేళ కాకపోయినా చిన్నకునుకు పట్టింది.

బస్సు ఆగింది. కునుకు చెదిరింది.

దిగేవాళ్ళు దిగుతున్నారు. బస్సు దాదాపు ఖాళీగాఉన్నా సీట్లు దొరకవనే ఆదుర్దాతో ఎక్కేవాళ్ళు దిగేవాళ్లకు అడ్డుపడుతున్నారు.

'కాఫీ తాగేవాళ్ళు తాగొచ్చు' కండక్టరు అరిచాడు, తనుకూడా-బస్సుదిగుతూ.

బస్సుదిగి అక్కడే ఉన్న డిపో కాంటీనుకు వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చాను. 'కాఫీ అలవాటు మానివేయ దలచుకొన్నవారు అక్కడ ఓ రెండుసార్లు కాఫీ తాగితే చాలు' అనిపించింది ఆ కాఫీత్రాగాక, పాడయిన నోటిని ఉద్ధరించడానికి ఓ వక్కపొడి పొట్లం కొన్నాను.

తిరిగి బస్సు ఎక్కేసరికి కండక్టరు అప్పుడే ఎక్కిన ఒక ప్యాసింజరుమీద చికాకు పడుతున్నాడు. 'హైదరాబాదుకి మూడూ ఎనభై పైసలు. ప్రతీవాళ్ళూ పెద్దనోట్లు తెస్తే చిల్లర ఎక్కణ్ణుంచి తేవాలి ?' కండక్టరు చికాకు సమంజస మనిపించింది. టికెట్‌మీద డ్యూ వ్రాయడంతో ఆ సద్దు మణిగింది.

టికెట్ల తిరణాల తరువాత బస్సు కదిలింది. కదిలి పదిగజాలు వెళ్ళిందోలేదో ఓ ఇద్దరు దాదాపు రోడ్డుకడ్డంగా నిలబడి బస్సును ఆపేశారు 'బాబుగారు వస్తున్నారు' అంటూ. ఆ బాబుగారికోసం ఈ జాతీయం చెయ్యబడ్డ ప్రజావాహనం ఆగి ఎదురు చూస్తోంది. కండక్టరు తలుపుతెరిచి ఆహ్వానిస్తున్నట్లు నిలబడ్డాడు.

ఒక నడివయస్సాయన తన స్వంత కారులో ఎక్కబోతున్నవాడిలా తాపీగా నడుస్తూవచ్చి బస్సుఎక్కాడు.

'రేపట్నుంచి మరో యాభైమందిని పెట్టి పదోతారీఖులోగా పని అయేట్లు చూడండి.' ఆయనను బస్సు ఎక్కించడానికి వచ్చిన ఆ గుంపులో ఎవరినుద్దేశించి చెప్పాడో !

బస్సు కదిలింది.

ఆయన వరాసరి వచ్చి ఖాళీగా ఉన్న నా ప్రక్కసీట్లో కూర్చున్నాడు, నన్ను కిటికీవైపు నొక్కేస్తూ.

'ఏంసార్ ! కులాసానా ?' కండక్టరు తలుపు మూసివచ్చి ఆయన్ని సాదరంగా ప్రశ్నించాడు. ఆయన చిరునవ్వుతో తల పంకించాడు. కాసేపు నిలబడి తరువాత తన సీట్లోకి వెళ్ళికూర్చున్నాడు కండక్టరు.

దూరంగా కూర్చొన్న వాళ్లను నిశితంగా పరిశీలించవచ్చు బస్సులో. మరీ ప్రక్కన కూర్చున్నవాళ్లను గమనించడానికి కొంత సమయం పడుతుంది.

ప్రక్కసీట్లో కూర్చొన్నాయన వయస్సు దాదాపు, యాభై ఉండొచ్చు. మనిషి భారీగా ఉన్నాడు. గోల్డుఫ్రేము కళ్ళజోడు ఆయన హుందాని పెంచింది. బుర్రమీసాలు కొద్దిగా నెరిసి ఆయన వ్యక్తిత్వంలో సరిగ్గా ఇమిడాయని పించింది. ఆయన ఖద్దరు పంచె, లాల్చీ, భుజంమీద చిలకంచు ఉత్తరీయం ఆయన పెద్దరికాన్ని సూచిస్తున్నాయి. ఆయన చేతికి రాయిలేని బంగారు ఉంగరం ముద్దుగా, మందంగా మెరిసింది. ఆయన్ను చూస్తే చేతిక్రర కేవలం ఠీవికోసం తప్ప దాని అవసరం ఆయనకు ప్రస్తుతం లేదనిపిస్తుంది.

ముత్తంమీద ఆయన స్వరూపం నాలో ఆయనగురించి తెలుసుకోవాలనే ఉత్సుకతను కలిగించింది.

'మీరూ హైదరాబాదేనా ?' ఇంతలో ఆయనే పలుకరించాడు.

'ఔనండీ.' ఆయన పలకరింపులోనే ఆయన హైదరాబాదు వస్తున్నారని తెలిసింది. జవాబిచ్చి, ఆయన గురించి తెలుసుకుందా మనుకున్నాను. కానీ, ఆయన ప్రశ్నల వర్షం నన్ను ప్రశ్నలు వేయనివ్వలేదు.

'మీరూ ఇక్కడే ఎక్కారా ?'

వికారాబాదునించి వస్తున్నానో చెప్పాను.

'ఆ ఊళ్లో ఉద్యోగమా ?'

'అవునండీ. స్టేట్ బ్యాంకులో పని చేస్తున్నాను.'

'హోదా ఏమిటి ? క్యాషియరా ?'

'కాదండీ. ఆఫీసరుగా చేరి సంవత్సరం అవుతోంది...' ఆయన అటుగా జరిగి నాకు మరో కొంతస్థలం మంజూరు చేశాడు. ఆయనగురించి తెలుసుకోడానికి కొంత వ్యవధి దొరికింది. అది ఉపయోగించుకునే లోగా ఆయన మరో ప్రశ్న వేశాడు.

'పెళ్ళి అయిందా ?'

లేదన్నాను. ఆయన మా కుటుంబం గురించి కనీసం మరో అరడజను ప్రశ్నలు వేశాడు. ఆయన ప్రశ్నావళి కంతకూ ఓపిగ్గా జవాబులు చెప్పాను, కాస్త చనువు

# ప్రతినిధి

తీసుకున్నాడాయన.

'మీరెంకులం నాయనా ?'

నన్ను చాలా ఇబ్బంది పెట్టే ప్రశ్నల్లో ఇది మొదటిది. ఒకసారి ఆయన కళ్ళలోకి చూసి సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాను.

'నాకు కులాలమీదా మతాలమీదా నమ్మకం లేదండీ. నేను ఇతరుల గురించి తెలుసుకునే సమయాలలో వీటిని విస్మరిస్తాను.' ఆయనకు అర్థమయినట్లుంది.

'భేష్, బాగా చెప్పావు నాయనా ! నాకు నచ్చావు. చెప్పుకోడానికి తప్ప ఈ రోజుల్లో కులాలకు ప్రాముఖ్యంలేదు. ఎంతమంది తమ కుల వృత్తుల్లో ఉన్నారు చెప్పు ? ఆ రోజులు పోయాయి...'

'—మన ప్రభుత్వం కూడా మనం మరచిపోతున్న కుల, మత వ్యవస్థలను మళ్ళీమళ్ళీ మనకు జ్ఞప్తికి తేకుంటే ఇంకా బాగుంటుంది. ఉద్యోగంకోసం దరఖాస్తు పెడదామంటే ముందుగా మనం ఏకుల మతాలకు చెందినవాళ్లమో చెప్పాలి! ఇన్నీ చెప్పి మనం ఎవరిమో మళ్ళీమళ్ళీ స్మరించుకుంటూ కులమత బేధాలు లేకుండా ఉండమంటే ఎంతవరకూ సాధ్యమో మీరే చెప్పండి.'

'బాగుంది నాయనా, నువ్వు చెప్పేది; మనిషికులం తెలుసుకోకుండా ఏలా ఇమ్మంటావ్, ఉద్యోగం ? కనీసం అతడు వెనుకబడ్డజాతి వాడేమో అద్దైనా తెలుసుకోవాలి కదా ! అందుకైనా అతడు ఏకులంవాడో తెలియాలి. వెనుకబడ్డ తరగతులవారిని ఉద్ధరించవలసిన అవసరం నేడెంతైనా ఉంది.'

'సరే, మీరు చెప్పింది ఒప్పుకుందాం. మరి మతం ఏమిటో అడగటం దేనికి ? మతం తెలుసుకోకుండా 'ఉద్యోగం ఇవ్వకూడదా ? మీరు పెద్దవారు; నాకు తెలిసినది తక్కువే అయి ఉండొచ్చు. కానీ, నా దృష్టిలో కులాన్నిబట్టి మనిషియొక్క ఆర్థిక సాంఘిక స్థోమత అంచనా వెయ్యడం అనుచితం. వెనుకబడ్డ జాతులవారిని ఉద్ధరించడం అంటే మిగిలినవారిని అణగద్రొక్కడం కాకూడదు.'

'నీ ధోరణి నాకు నచ్చలేదు' అన్నట్లు ఆయన మౌనంగా చిరునవ్వు నవ్వారు. నేను అంతగా ఆవేశపడటం నాకే నచ్చలేదు కొంతసేపు ఇద్దరం మౌనంగా ఉన్నాము.

బస్సు వేగంగా పోతోంది. హెడ్లైట్లు చీలుస్తున్న చీకటి బస్సు వెనుక వెంటనే కలుసుకొంటోంది !


'మీ పేరు సెలవివ్వారు కాదు' తెచ్చిపెట్టుకొన్న నమ్రత నా మాటల్లో విన్పించింది.

'నన్ను భుజంగరాయుడంటారు. ఇక్కడ మా వాళ్ళదొక కాంట్రాక్టు ఉంటేనూ, చూద్దామని వచ్చాను ... హైదరాబాదులో ఉంటున్నాను ప్రస్తుతం.' కిటికీలోనుండి దూరంగా చూస్తూ అన్నారాయన.

'మీరుకూడా కంట్రాక్టరా ?'

'లేదు బాబూ ! ఏదో శక్త్యనుసారం దేశానికి ఇంత సేవ చేద్దామనే తహతహ మాత్రం ఉంది. క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో, కొద్ది తేడాలతో ఓడిపోయాను. మొన్న మళ్లీ నామినేషను దాఖలు చేశాను. ఈసారి గెలవడం ఖాయం...స్వాతంత్ర్య పోరాటంలో రెండుసార్లు జైలుకెళ్లాను...అప్పటి లాఠీ దెబ్బల నొప్పులు ఇప్పుడే కొన్తకొన్త మరచిపోతున్నాం ! మా రోజులే వేరు. ఆనాటి విజాయితీ మళ్ళీ వెలుగు చూడదేమో...'

ఆయన కంఠంలో బాధ నాకు స్పష్టంగా వినిపించింది.



# ప్రతినిధి

ముందుసీట్లో ఉన్నఇద్దరు—స్టూడెంట్లు పోలు. తెలుగు చలన చిత్రసీమలో ఏ హీరో గొప్పవాడో తేల్చుకోడానికి హోరాహోరీ వాదించుకుంటున్నారు. వారి ముందు సీట్లో యువకుడు తన భార్యతో ఏదో గొణుగుతున్నట్లు మాట్లాడుతూ మధ్యమధ్య సిగరెట్ ఊదుతున్నాడు, 'పొగ తాగరాదు' అన్న నోటీసు దిగాలుపడి చూస్తోంటే. భుజంగ రాయుడుగారు నా మీదుగా దూరంగా చీకట్లోకి చూస్తూ మళ్లీ హఠాత్తుగా మాట్లాడటం మొదలు పెట్టారు. ఆయన కంఠంలో గాంభీర్యం ఆవేదన నన్ను ఆకర్షితుణ్ణి చేశాయి.

'మన ఇంటిని మరొకడు పాలించినంత కాలం మనకు స్వాతంత్ర్యం లేదని ఏడ్చాము. అహింసా కవచంలో ఇమిడి తరువాత ఎన్నో కష్టాల ఫలితంగా స్వేచ్ఛను సాధించాము. కానీ, బాబూ! ఇవాళ మనకున్న స్వేచ్ఛ ఎందుకు ఉపయోగ పడుతోందో తెలుసా? మన ఇంటిని మనం దోచుకోడానికి; మన వాళ్లకు తిండీగుడ్డా తగినంత దొరక్కుండా చేయడానికి; కొందరు మస్తుగా తిని త్రాగుతున్న తరుణంలో ఎందరో పస్తులుండడానికి!


సలభై ఏడుకి ముందున్న నిజాయితీ మనలో ఇవాళ ఎందుకు లేదు? ఆనాటి మన ఐక్యత యుద్ధసమయాల్లో తప్ప కన్పించదేం? నేనూ నా కుటుంబం అనే వారే తప్ప నేనూ నా దేశం అనేవారు నేడు మృగ్యం.

దీనికంతకూ నాకు ఒకే కారణం కన్పిస్తుంది. అదే, మనలో జీర్ణించుకుపోయిన అవినీతి! ఇవాళ మనమంతా అవినీతి ప్రవాహంలో దిక్కు తెలియకుండా కొట్టుకుపోతున్నాం బాబూ! ఎన్నికల్లో పోటీ చెయ్యాలంటే పార్టీ టికెట్టు మంచి వాడికి దొరకదు; అవినీతి మార్గాలద్వారానే రావాలి. ఇక ఎన్నికల్లో గెలిచేవారెందరో నోట్లిచ్చి ఓటు కొంటున్న సంగతి రహస్యం మాత్రం కాదు. మన జీవితంలో సకల హక్కులూ ఆ ఓటుతో బాటుగా అమ్ముకొంటున్నాం మనము. అంతెందుకు? ఇల్లు కట్టాలంటే మునిసిపల్ పర్మిషన్ కావాలి కదా! అది లంచంలేకుండా, సిఫార్సు లేకుండా ఓ నెలలోగా నీవు తీసుకురాగలిగితే నాచెవి కోసుకుంటాను. పెద్ద ఆఫీసర్లకు బార్‌లో అభిషేకం చేయనిదే, బల్ల క్రింద చేతికి కట్టలు అందించనిదే నీకు ఏ కాంట్రాక్టు వచ్చినా నేను నా చర్మంతో నీకూ ఆ ఆఫీసర్‌కీ చెప్పులు కుట్టి ఇస్తాను.

పెద్ద డాక్టరు దయ తలచనిదే బీదవాళ్ళకి జనరల్ హాస్పిటల్‌లో బెడ్ దొరకడం గురించి నువ్వెప్పుడైనా విన్నావా? మనలో ప్రతివాడూ తను ఎవరినో మోసం చేస్తున్నా ననుకొంటున్నాడు. కానీ, మనను మనమే మోసం చేసుకొంటున్నాం అన్న నిజాన్ని మనమంతా విస్మరించాము! మా రోజుల్లో బ్రతికిన నిజాయితీ నేడు దేశం పొలిమేరలు దాటింది.

ఒక్క విషయం బాబూ! మన దేశం—అంటే మనమంతా నేడున్న పతనపు తీరం వదలి ప్రగతి తీరం చేరాలంటే మధ్యనున్న భయంకర అవినీతి ప్రవాహాన్ని దాటాలి. దానికి వారధి అవసరం. ఆ వారధి కట్టడానికి ఒక్క గులకరాయి చాలదు; కోట్ల సంఖ్యలో కావాలి. అందులో ఎన్నో మునగటం కూడా తథ్యం. ఆ మునిగిన వాటి మీదనే వారధి నిలుస్తుంది! నేటి యువకులందరూ దేశాన్ని ఉద్ధరించడానికి అవినీతిని వదలి దీక్షతో నడుముకట్టాలి బాబూ! భారతీయులంతా నేడు ఆ గులకరాళ్ళు కావాలి! అలా కానినాడు మేము నలభై ఏడుకి ముందు చేసిన త్యాగాలు నిరర్థకమౌతాయి.' ఆయన మాటల్లోని నైర్మల్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. దేశం నేడున్న పరిస్థితి గురించి నేనూ ఎన్నోసార్లు ఆలోచించి బాధ పడుతూంటాను; నా సన్నిహితుల్ని, స్నేహితుల్నీ మంచి మార్గానికి మళ్లించడానికి తాపత్రయ పడటంలో నా కెంతో తృప్తి కనుపిస్తుంది...నాకు తెలియకుండానే ఆయన మీద నాకు పూజ్యభావం ఏర్పడింది, ప్రక్క నుండి ఆయన గంభీర కంఠస్వరం మళ్లీ విన్పించింది. ఆయన బయటకు చూస్తూ గాలిలోకి మాట్లాడుతున్నట్లు పలికారు...

'మనలో స్వార్థం పెరిగిపోయింది. మన జేబులు పెద్దవయ్యాయి. మనము తెలివి మీరాము...మచ్చుకి మన పిల్లల చదువుల సంగతే చూడు. రెండో తరగతి వాడికి ఇరవై రెండు పుస్తకాలు! మేము చదివే రోజుల్లో ఫస్ట్ ఫారందాకా తెలుగుపుస్తకం, లెక్కల పుస్తకం తప్ప మరొకటి ఉండేది కాదు. ఇవాళ స్కూలుఫైనల్ పాసయిన వాడికి పట్టుమని పదెక్కాలూ ఇరవైల దాకా సరిగ్గా రావు. తెలుగు పద్యాలు రెండైనా కంఠస్థం రావు. డిగ్రీ విద్యార్థు



లో చాలామంది వ్యాకరణబద్ధంగా సరైన పంక్తులు ఇంగ్లీషు వ్రాయలేరు.' ఆయన ఆగారు.

మా నాన్నగారు తమ స్కూలు ఫైనలు చదువుతో బి.కాం. చదివిన నాకంటె మంచి ఇంగ్లీషు వ్రాస్తారన్న సంగతి నాకు తెలియనిది కాదు. కానీ, తప్పంతా విద్యార్థుల మీదికే నెట్టడం నాకు నచ్చలేదు.

'నా ఉద్దేశ్యంలో అది వారి తప్పుకాదు. వారి కిచ్చిన శిక్షణ అలా వుంది. ఒక పాఠంలో ఎనభై పద్యాలుంటే అందులో యాభై మాత్రమే సిలబస్‌లో ఉంటాయి. వాటిలో ఐదింటికి పువ్వు గుర్తు ఉంటుంది! పరీక్షల దృష్ట్యా మాస్టరు అందులో రెండు చాలా ముఖ్యమంటాడు. మనవాళ్ళు అందులో ఒకటే చదువుతారు!' నా అభిప్రాయం వ్యక్తపరిచాను.

'నేను ఎవరి తప్పులూ విప్పిచెప్పడం లేదు. ఎవరి దృక్పథం వారికి సబబుగానే కన్పిస్తుంది. కాకపోతే, అందులో యెంత స్వార్థముందో నిష్పక్షికంగా ఎవరికి వారు తూచి చూడాలి. రెండవ తరగతి తెలుగు పుస్తకానికి కూడా గైడ్సు వ్రాశారు మన వాళ్ళు! మాస్టరు సరిగ్గా చెప్తే, విద్యార్థులు సరిగ్గా వింటే వీటి అవసరం ఎందుకుంటుంది? మన పిల్లల విద్యా ప్రమాణం ఇలా ఏడవడానికి కారణం ఈ గైడ్సే. వీటిని నిషేధించాలి. ఇవి వ్రాసేవారిని జైళ్ళలో పెట్టాలి. వారంతా దేశద్రోహులు...'

అంత పెద్దమనిషి అలా ఆవేశపడుతుంటే చూడ్డానికి తమాషాగా ఉంది. ఆయన నాకు కొంత 'క్రెడిట్' యిచ్చి మళ్ళీ సాగించారు తన వాక్ప్రవాహాన్ని.

'నువ్వు చెప్పింది కూడా నిజమేలే! ఇది ఏ ఒక్కరి తప్పూ కాదు. ఇందులో అందరికీ పాలుంది. గైడ్సు వ్రాస్తే డబ్బు వస్తుందని వ్రాసేవారికి తెలుసు; స్కూలు జీతం కట్టగానే పిల్లల చదువు బాధ్యత తాము పూర్తిగా నిర్వర్తించామని భావిస్తారు నేటి తల్లిదండ్రులు; పాఠాలు సరిగ్గా చెప్పినా చెప్పకపోయినా జీతాలు తమ కొస్తాయని ఎందరో ఉపాధ్యాయులకు నిర్దిష్టంగా తెలుసు; కాపీలు కొట్టినవారిని పాస్ చెయ్యడం తప్ప పరీక్షాధికారులు ఏమీ చెయ్యలేక పోతున్నారు. తాము చదవకపోయినా తమ తల్లిదండ్రులు డబ్బుతో

పిల్లలు-ఆరోగ్యము



# అప్పుడే మరో పాప అవసరమా? ఆలోచించండి!

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వెంటవెంటనే పిల్లలు పుట్టడం అన్నది అటు తల్లి దేహస్థితికీ, ఇటు పిల్లల ఆరోగ్యానికీ కూడా మంచిదికాదు. కాబట్టి వెంట వెంటనే పిల్లలు పుట్టకుండా చూసుకోవడం, కనీసం ఒక బిడ్డకు మరో బిడ్డకు మధ్య మూడు సంవత్సరాలైనా తేడా ఉండేలా చూసుకోవడం, కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవడం అన్నవి దంపతుల ముఖ్య బాధ్యతలు.

అసలు కుటుంబ నియంత్రణ అంటే భయపడేవాళ్ళు బాగా చదువుకున్నవారిలో కూడా ఈ నాటికీ చాలా మంది ఉన్నారు. కుటుంబాన్ని పరిమితం చేసుకోవడం అన్నది దంపతుల స్వవిషయమే. దానిని ఎవరూ కాదనలేరు. కానీ యిప్పటి దేశ కాలపరిస్థితులని అనుసరించి వారి వారి ఆర్థిక స్తోమతును బట్టి కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవడం ఎంతైనా అవసరం.

వెంట వెంటనే పిల్లలు పుట్టడం వల్ల తల్లి ఆరోగ్యం దెబ్బతింటుంది. పిల్లలు కూడా బలహీనంగా, అనారోగ్యంగా ఉంటారు.

ఎక్కువ మంది పిల్లల్ని కని, వారిని సరిగా పెంచలేక రోగాలతో, అప్పులతో ఇతరత్రా చికాకులతో సతమతం కావడంకన్నా కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకుని పుట్టిన ఇద్దరు ముగ్గురు పిల్లలకి మంచి ఆహారం, చక్కని సౌకర్యాలు, తగిన వైద్య సహాయం సమకూర్చేలా చూసుకుంటే అంతకన్నా తల్లిదండ్రులకి, పిల్లలకి కావల్సిందేముంటుంది?

కుటుంబ నియంత్రణ ఉద్యోగుల్ని చూడగానే ముఖం చాటు చేసుకుపోయేవారు, విసుగుని ప్రదర్శించేవారు ఎంతోమంది ఉన్నారు. కానీ వారేది చెప్పినా మన మంచికోసమేనని గ్రహించేవారు చాలా తక్కువమంది, ఆచరించేవారు యింకా తక్కువ మంది ఉంటారు.

'పుట్టిన పిల్లలంతా బతికి బట్ట కడతారని నమ్మకం ఏముంది? కుటుంబాన్ని పరిమితం చేసుకుంటే అలాంటి అనుకోనిది ఏదైనా జరిగితే అప్పుడు మా గతేమిటి?' అనే వారు కొందరు ఉన్నారు. కాని పుట్టిన ప్రతి బిడ్డకు సరైన ఆహారం సమకూర్చి తరచు నిపుణుల చేత పరీక్ష చేయించి అవసరమైన సలహాలని సహాయాన్ని అందించి, అంటు వ్యాధులకు గురికాకుండా వారిని జాగ్రత్తగా కాపాడితే ఎలాంటి అపకటనాలు జరగకుండా చూడవచ్చు. అదే ఎక్కువమంది పిల్లలు ఉంటే ఎంతోమంది తల్లిదండ్రులకి అలాంటి సౌకర్యాలు గగన కుసుమాలుగానే ఉంటాయి. అందువల్ల పిల్లల పోషణ విషయంలో నిర్లక్ష్యం జరుగుతుంది.

కుటుంబాన్ని పరిమితంగా ఉంచుకోవాలంటే ఖచ్చితంగా ఆపరేషన్ చేయించుకోవాలనే నియమం ఏమీ లేదు. శస్త్ర చికిత్స అనే సరికి ఎంతోమంది విముఖతని ప్రదర్శిస్తారు. దానివల్ల శరీరానికి ఏదో చేటు జరుగుతుందని చాలామంది అనుకుంటుంటారు. కానీ అలాంటివన్నీ పూర్తిగా నిరాధారాలు. శస్త్ర చికిత్సవల్ల ఆరోగ్యంలో ఎలాంటి మార్పూ రాదు. శస్త్ర చికిత్స అవసరం లేకుండానే కుటుంబాన్ని పరిమితం చేసుకోడానికి అనేక మార్గాలు ఉన్నాయి. కుటుంబంలోని పిల్లల సంఖ్య, తల్లి ఆరోగ్యం మొదలైన విషయాలపై అవి ఆధారపడి ఉంటాయి.

ఈ విషయంలో దంపతులిద్దరూ కలిసి నిపుణులైన వైద్యుల సలహా, సహాయాలని పొందాలి. వైద్యులు యిచ్చిన సలహాలని తప్పకుండా పాటించాలి.

మోర్కులు కొనగలరనీ నేటి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా తెలుసు...

గురువులకు లేని శ్రద్ధ, క్రమశిక్షణ విద్యార్థులకెలా వస్తాయి? ఏ ఒకరిద్దరు మాస్టర్లో నిజాయితీ ప్రదర్శించి పిల్లల్ని బాగుచేద్దామనుకొంటే వారికి మిగిలేది నిరాశమాత్రమే. వారుమాత్రం ఏం చేస్తారు? ఒకనాడు ముప్పై ఉండే క్లాసులో నేడు నూట ఇరవైమంది చేరారు. వీరిలో చాలామంది సరిగ్గా మాస్టారు కంటపడకుండానే సంవత్సరం గడిచిపోతుంది. నేటి పరిస్థితిలో 'గురు శిష్యుల' మధ్య వ్యక్తిగత సంబంధం అసాధ్యం! ఇవి ఇలా ఉండగా మన నాయకులు విద్యావిధానాలతో లెక్కలేని ప్రయోగాలు చేస్తున్నారు. ఇవాళ ఒక రెగ్యులేషను; రేపు ఉదయం ఇంకొకటి; రేపు సాయంత్రం మరొకటి. నేటి విద్యార్థులే రేపటి ఉపాధ్యాయులన్న విషయం జ్ఞప్తికొస్తే మాత్రం నాకు ఒళ్లు జలదరిస్తుంది!'

ఆయన చెప్పేమాటలు మనలో చాలా మందికి తెలిసిన నిజాలే అయినా వాటిని వినడంలో ఏదో క్రొత్తదనం కన్పించింది నాకు. లాల్చీ జేబులోనుంచి తీసిన మల్లెపువ్వులాంటి రుమాలుతో ఎడమచేతిలో ఉన్న కళ్లజోడు తుడుచుకుంటూ నావైపు చూశారాయన.

'—మన నాయకులలో ఎవరైనా సరే నిరుద్యోగ సమస్యగురించి ప్రిపరేషన్ లేకుండా రెండుగంటలు ధాటీగా ఉపన్యాసం ఇవ్వగలరు. అంతకన్న వారు మాత్రం ఏం చేస్తారు? అగ్రికల్చర్ కాలేజీలో చదివి పాసయినవాడికి, తన స్వగ్రామంలో భూమి వస్త్రైరా ఉండికూడా సిటీలోనే ఉద్యోగం కావాలి. ఇంతమంది బి. ఇ. లు నిరుద్యోగులగానే ఉంటారు తప్ప ఏ గ్రామానికోపోయి చిన్నచిన్న పరిశ్రమలు మొదలుపెడదా మనుకోరు. నగరంలో డాక్టర్లు అదేవీధిలో ఆరోశాడిగా ఉంటారు కానీ, పల్లెసీమలవైపు కన్నెత్తి చూడరు. అన్ని ఉద్యోగాలూ సిటీలోనే కావాలంటే ఎలా వస్తాయి? మూడు పంచవర్ష ప్రణాళికలు, మూడు ఏకవర్ష యోజనలు మనను దాటాయి. నాలుగవ పంచవర్ష ప్రణాళిక కూడా చివరికొస్తోంది.

# ప్రతినిధి

కాగితాలమీద ఎంతో ఆశాజనకంగా కనుపించే ప్రణాళికలు ఆచరణలో ఎందుకంత అధ్వాన్నంగా తయారవుతాయి? ఎన్నో కోట్లు పెట్టుబడికి ఆశించినంత ప్రతిఫలం రావడంలేదు. కారణం మనలో ఉన్న తోడేళ్లగుంపులు!

హాస్పిటల్ గేటు మొదలు ఢిల్లీలో మంత్రుల కార్యాలయాలవరకూ లంచగొండితనం! హైస్కూల్లో సీటుదగ్గర నుండి హైకోర్టులో జడ్జిమెంటువరకూ కావలసినవి సిఫార్సులు! మనలో ఈ నైతిక పతనానికి కారణం ఏమిటి?'

ఒక్కక్షణం ఆగారాయన. చర్వితచరణంతో బాటు ఒకదాని కొకటి సంబంధం లేకుండా మాట్లాడటం ఆయనలో నేను గమనించిన మరో విశేషం. కానీ, ఆ మాటల్లో వ్యక్తమయ్యే ఆయన మనోవేదన నన్ను కరిగించక పోలేదు. బస్సులో చాలామంది మావైపే చూడటం నాకు కొద్దిగా ఇబ్బంది కలిగించింది. తన ప్రశ్నకు తనే జవాబు చెప్పుకున్నారు ఆయన.

'—ఆత్మ విమర్శలేక పోవడం; మన మీద మనకు విశ్వాసం సన్నగిలడం. సంస్కృతికంగా, ఆర్థికంగా, శాస్త్రీయముగా, సామాజికంగా మనకంటె చాలా దేశాలు ఉన్నతంగా ఉన్నాయంటే మనం తల వంచుకొంటున్నాము. తలవంచడం తేలిక, తలపైకెత్తి ఆత్మవిశ్వాసంతో దేశాన్ని ఉన్నతస్థానంలో ఉంచ ప్రయత్నించడం కష్టమే, ముఖ్యంగా మనదేశంలో."




ఆయన మాటలు నామీద బలమైన ప్రభావాన్ని చూపాయి. దేశంలోని అవినీతిని ఒక్కడిగా ఆపలేక, తాము చేసిన నాటి త్యాగాలు గుర్తుచేసుకొని బాధపడుతున్న ఆయన్ని చూస్తే జాలికూడా వేసింది.

'ఈయన ఎన్నికల్లో తప్పకుండా గెలవాలి. ఇటువంటి వారిసంఖ్య నాయకులలో ఎంత పెరిగితే దేశం అంత బాగుపడుతుంది. భగవాన్! ఈయన ఎన్నికల్లో గెలిచేటట్లు చెయ్యి మనసారా కోరుకున్నాను.

దూరంగా విద్యుద్దీపాల వెలుగు కన్పించింది. ముందుసీట్లో ఇద్దరూ తనువాదాన్ని ఎప్పుడు ఆపారో, చెరొక 'శవ సాహిత్యం' పుస్తకాన్ని పట్టుకొని దీక్షగా చదువుతున్నారు.

వారి ముందు సీట్లో యువకుడు తన భార్య భుజంమీద వాలి నిద్ర పోతున్నాడు. ఆమె కిటికీకి తల ఆన్చి దూరంగా చూస్తోంది. వెనుక ఎవరో ఈ ఏడు పంటల గురించి మాట్లాడుతున్నారు. కండక్టరు సంచీ ఒళ్లో పెట్టుకొని డబ్బు లెక్క పెట్టుకొంటున్నాడు.

బస్సు నగరం పొలిమేరల్లోకి వచ్చేసింది.

కండక్టరు నవ్వుతూ మా సీటు దగ్గర కొచ్చాడు. భుజంగరాయుడిగారి ఖద్దరు లాల్చీలో నుండి బరువైన పర్సు బయటికొచ్చింది. పెద్ద నోట్లు కన్ను గీటాయి.

కండక్టరుకు రెండు రూపాయలు ముట్టాయి!

నాకు బుర్ర తిరిగిపోయింది. అర్థంకానట్లు ఆయన ముఖంలోకి చూశాను.

ఆయన నవ్వారు. కండక్టరు నవ్వాడు. వాళ్ళిద్దరి నవ్వులో నాకు దేశంలోని కుళ్ళంతా కన్పించింది!

డిపో మరో రెండు ఫర్లాంగులు ఉందనగా ఆయన కోసం స్పెషల్‌గా బస్సు ఆగింది.

'వస్తానూ బాబూ' అంటూ బస్సు దిగి జనంలో కలిసిపోయారు కాబోయే ప్రజా ప్రతినిధి!

ఏడుస్తూ మళ్లీ కదిలింది బస్సు. ●